క్లుప్తంగా

నేడు కూరగాయల మార్కెట్ నిర్వహణకు వేలం

కమలాపూర్ : మండల కేంద్రంలోని గుడిబండ వద్ద ప్రతిరోజు నిర్వహించే కూరగాయల మార్కెట్ నిర్వహణకు 2025–26 సంవత్సరానికి ఈనెల 20వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి గుండె బాబు, పంచాయతీ కార్యదర్శి కొరండ్ల రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనదలిచినవారు ముందుగా రూ.50,500 డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. కూరగాయల మార్కెట్ నిర్వహణ బాధ్యతలు దక్కించుకున్న వారు గ్రామపంచాయతీ షరతులకు లోబడి ఫీజు వసూలు చేయాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

గుప్పెడు బియ్యం సేకరించి..



మానవత్వం చాటుకున్న విద్యార్థులు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో గల నాగార్జున పాఠశాల విద్యార్థులు ఇంటినుంచి ప్రతి సోమవారం గుప్పెడు బియ్యం తీసుకొచ్చి 50 కిలోల బియ్యాన్ని పొదుపు చేశారు. కాగా గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన రాయరాకుల లక్ష్మణ్ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు ఆ బియ్యాన్ని అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. దీంతో గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

శాయంపేట : కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పత్తిపాకలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాక గ్రామానికి చెందిన మిరియాల ఓదేలు (70) కూలీ పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఓదేలు కొద్ది రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. దీంతో భార్య సమ్మక్క అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేపించింది. కాగా కుటుంబ సభ్యులు వివిధ పనుల నిమిత్తం బయటకెళ్లారు. తిరిగి ఇంటికొచ్చి చూసేసరికి ఓదేలు ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేయగా చుట్టుపక్కలవారు వచ్చి కిందకి దించారు. కానీ అప్పటికే ఓదేలు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సమ్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ పేర్కొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు



ఆత్మకూరు : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 172 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్సై తిరుపతి బందోబస్తు నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ బీ.ఎస్.రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

అమ్మవారిని దర్శించుకున్న టీజీఈఆర్సీ చైర్మన్

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని టీజీఈఆర్సీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున, హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం అందజేశారు.

సీపీకి శుభాకాంక్షలు

ఖిలా వరంగల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను టీజీఎస్పీ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ బాధ్యులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీపీని కలిసిన వారిలో అధ్యక్షుడు రంగరాజు ప్రకాశ్, చిలుమల్ల సత్తయ్య, జయేందర్ రెడ్డి, గాజుల కుమారస్వామి ఉన్నారు.

నగదు పురస్కారాలు

కాజీపేట రూరల్: దర్గా కాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు 100 హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందజేశారు. బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ ఎస్.స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రీఫైనల్స్‌లో ప్రతిభ చూపి 9.5 పాయింట్లు సాధించిన చరణ్, శుభరాత్రి, సౌమ్యకు నగదు పురస్కారాలు అందించారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు



కమలాపూర్-ఉప్పల్ వెళ్లే మార్గంలో వ్యవసాయ బావి (వృత్తంలో)



పొదలతో కనిపించకుండా ఉన్న గూడూరు-వంగపల్లి వద్ద బావి (వృత్తంలో)

- రోడ్డు సమీపంలో రక్షణ గోడలు లేని పరిస్థితి
- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- భయాందోళనలో వాహనదారులు

కమలాపూర్ : మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్డు సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు ప్రమాదకరంగా మారాయి. హుజూరాబాద్–పరకాల మార్గంలో కమలాపూర్ నుంచి ఉప్పల్‌కు వెళ్లే రహదారి వెంట, ఉప్పల్ శివారులో, కమలాపూర్ నుంచి శనిగరం వెళ్లే మార్గం లక్ష్మీపూర్ వద్ద రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి, గూడూరు నుంచి వంగపల్లి క్రాస్ రోడ్డుకు వెళ్లే బైపాస్ మార్గంలో గూడూరు గ్రామ శివారులోని ఓ మలుపు వద్ద ఉన్న వ్యవసాయ బావి, కన్నూరు నుంచి తాటి వనం మీదుగా కమలాపూర్‌కు వచ్చే రహదారిలో కన్నూరు శివారులో రోడ్డు పక్కనే ఒకదాని పక్కనే మరొకటి ఉన్న రెండు వ్యవసాయ బావులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం ఆయా బావుల చుట్టూ చెట్లు ఏపుగా పెరిగి దగ్గరకు వెళ్తే తప్ప అక్కడ బావులు ఉన్నాయనే ఆనవాళ్లు కూడా కనిపించడం లేదని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఆ బావుల వద్ద సంబంధిత అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోగా కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని, సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరుగక ముందే రోడ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

‘పది’ పరీక్ష కేంద్రాల వద్ద 163 యాక్ట్



శాయంపేట : ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో 163 యాక్ట్–2023 (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత) చట్టం అమలు చేయనున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ బుధవారం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతరులు పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల దూరంలో ఉండాలని అన్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్షలు ముగియనున్నాయని, పరీక్షలు ప్రశాంతంగా సాగేందుకు అందరూ సహకరించాలని అన్నారు. ప్రశ్నపత్రం క్యూర్ కోడ్‌తో పాటు సిరియల్ నంబర్ ఉంటుందని, 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌ను ఇన్విజిలేటర్లు అందిస్తారని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు మాస్‌కాపింగ్‌కు పాల్పడకుండా పరీక్ష రాయాలని ఎస్సై పరమేశ్ తెలిపారు.

‘మామిడి’ సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

వేలేరు : ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు, పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ హనుమకొండ డివిజన్ అధికారి బి.సుష్మిత రైతులకు ఓ ప్రకటనలో సూచించారు. మామిడిలో ప్రస్తుతం ప్రధానంగా కనబడే సమస్యలు తామర పురుగు, కాయ తొలుచు పురుగు, పిందె రాలడం వంటి సమస్యలకు 200 లీటర్ల నీటికి ఫిప్రోనిల్ 80 గ్రాములు, టెబ్యూకొనజోల్ 75 గ్రాములు, ఆర్థోసాలిసిలిక్ యాసిడ్ 500 ఎంఎల్ కలిపి తోటపై పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా 10 సంవత్సరాల పైబడిన తోటలకు ప్రతీ చెట్టుకు 500 గ్రాముల యూరియా, 1కిలో పొటాష్ వేసి నీరు కట్టాలని, దీని వలన మామిడిలో పిందెరాలే శాతం తగ్గుతుందని తెలిపారు. మామిడి తోటలు సాగు చేసే రైతులు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటించాలని ఆమె సూచించారు. మామిడి సాగులో మెళకువలు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్కతుర్తి : మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన ఈర రాజు గతేడాది జూన్ 20వ తేదీన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి సీఈఆర్ టెక్నాలజీ ద్వారా సెల్‌ఫోన్‌ను ట్రేస్ చేసి పట్టుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి అప్పగించారు. సుమారు రూ.15వేలు విలువచేసే సెల్‌ఫోన్‌ను అప్పగించినందుకు రాజు పోలీస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను ట్రేస్ చేసి పట్టుకోనున్నట్లు ఆయన వెల్లడించారు.

‘ఆరోపణలు చేస్తే సహించేదిలేదు’



మాట్లాడుతున్న గుర్రపు ప్రసాద్

ధర్మసాగర్ : ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సభకు ప్రజలు రాలేదని బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గు చేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్ మండిపడ్డారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కాంగ్రెస్ పార్టీని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలు రాజయ్యను ఛీ కొడుతున్నారని విమర్శించారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క సంవత్సరంలోనే 800 కోట్ల నిధులు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే కడియం శ్రీహరికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని రెండు సార్లు గెలిపిస్తే రాష్ట్రంలో కుటుంబ పాలన చేస్తూ దొరికినకాడికి దోచుకుని రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. రైతుల పంటలకు సాగునీరు అందించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దేవాదుల ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారం, ఆరోపణలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బొడ్డు ప్రదీప్ కుమార్, తోట నాగరాజు, వల్లపురెడ్డి రాంరెడ్డి, బొడ్డు లెనిన్, కూనూరు రాజు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ శంఖ్వర్



పరకాల పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ అంకిత్‌కుమార్ శంఖ్వర్

పరకాల : అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ శంఖ్వర్ పోలీస్‌లకు సూచించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరాల వివరాలు, వివాదాస్పద గ్రామాల గురించి సీఐ క్రాంతికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అనుక్షణం అందుబాటులో ఉండాలని అన్నారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. యువత పెడదారి పట్టకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట పరకాల ఏసీపీ సతీశ్‌బాబు, పరకాల, నడికూడ ఎస్సైలు రమేశ్, శివకృష్ణ ఉన్నారు.

వేసవి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ సాయికృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ సాయికృష్ణ

శాయంపేట : ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆర్యోగ కేంద్రం వైద్యాధికారి సాయికృష్ణ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి, వడగాలులు వీస్తున్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఎండలో బయట తిరగొద్దని, వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. అత్యవసర పనులకు మాత్రమే బయటకు రావాలని అన్నారు. ఎవరైనా వడ దెబ్బకు గురైతే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు.

విద్యారంగానికి తక్కువ నిధులపై నిరసన



కేయూ మొదటి గేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు



కేయూ మొదటి గేట్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

విద్యారణ్యపురి: విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారని ఆరోపిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ మేరకు బడ్జెట్ ప్రతులను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీసం 20 శాతం నిధులు కేటాయిచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, బాధ్యులు గణేష్, రాజేష్, అనిల్, సాయి, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల నిరసన

కేయూ క్యాంపస్: బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువగా నిధులు కేటాయించారని ఆరోపిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కేయూ మొదటి గేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ మేరకు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, బాధ్యులు పురుషోత్తం, సాయికుమార్, పరిమళ, జస్వంత్, అజయ్, అఖిల్, కాన్నారావు, మల్లేష్, రాహుల్, రాజ్‌కుమార్, రవళి, రమ్య పాల్గొన్నారు.

కేయూ వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపుల్లో అన్యాయం చేశారని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద బడ్జెట్ ప్రతులను బుధవారం దహనం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, కేయూ ప్రధాన కార్యదర్శి పవన్‌కల్యాణ్, బాధ్యులు ముషారఫ్, ఆదిత్య, ఠాగూర్, యుగేందర్, రాజు, బబ్లూ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

‘ఆశా’లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు



వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

హన్మకొండ అర్బన్: ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హనుమకొండ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలో ఈఆర్‌సీ బహిరంగ విచారణ జరుగుతున్న సందర్భంగా గేట్లను నెట్టి లోపలికి వెళ్లేందుకు ఆశ కార్యకర్తలు ప్రయత్నించగా సుబేదారి పోలీసులు అడ్డుకున్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య వారి వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకొని సమస్యలు పరిష్కరిస్తానని, వేతనాల పెంపు విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాగుల రమేష్, కాసు మాధవి మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, రాజేశ్వరి, శ్రీవాణి, కల్పన, గౌరె పుతిలి, శోభ, రమ, సంధ్య, యాకూబీ, శోభ, పద్మ, జ్యోతి, సూర్య, కళ, రజిత, లీల పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్ ఎదుట..

వరంగల్: ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ప్రకటించే వరకు పోరు ఆగదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి అన్నారు. ఎన్నికల హామీల ప్రకారం ఆశాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చినగారి రాణి, సుజాత, వజ్ర, సునీత, రత్నకుమారి, మాధవి, పద్మ, మంజుల, రమ, సంధ్య, రమ, రజిత, రేణుక, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తాజా చేపలను కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గణేశ్

ఖిలా వరంగల్: రిటైల్ మార్కెట్లో ఆరోగ్యమైన తాజా చేపలను ప్రజలు కొనుగోలు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణ జ్యోతి, వ్యవసాయ శాస్త్రవేత్త గణేశ్ సూచించారు. ఈమేరకు మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ సౌజన్యంతో చేపల ఉత్పత్తులు, పరిశుభ్రత నిర్వహణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.భార్గవి, డాక్టర్ సీహెచ్ సౌమ్య, అనుష పటేల్, మత్స్యకార మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ పోరాటంతోనే వర్గీకరణ బిల్లు ఆమోదం



కమలాపూర్ : చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆత్మకూరు : సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్కతుర్తిలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు



పరకాల : సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంతో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు
- సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకాలు

కమలాపూర్ : పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ విజయమని, ఈ విజయాన్ని మాదిగ అమరవీరులకు అంకితం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడంపై హర్షిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అంకిల్ల రాజు మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ సారథ్యంలో ఎన్నో అవరోధాలు, ఆటంకాలు, నిర్బంధాలు, కుట్రలు, కుతంత్రాలు అధిగమించి ఎస్సీ వర్గీకరణ సాధించామని అన్నారు. ఈ విజయం మాదిగ జాతికి గర్వకారణమన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ముత్యాల రమేశ్, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్, జిల్లా కార్యదర్శి రవీందర్, నాయకులు రమేశ్, చంద్రమౌళి, రాజ్‌కుమార్, ప్రసాద్, జయరాజ్, సమ్మయ్య, రమేశ్, సునీల్, రాజ్‌కుమార్, సది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

పరకాల : అసెంబ్లీ సమావేశాల్లో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం పరకాల పట్టణంలోని బస్టాండ్ కూడలిలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేపట్టి అసెంబ్లీలో ఆమోదించారని, సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును గౌరవించి దేశంలోనే మొట్టమొదటి సారిగా ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదానికి కృషి చేశారని కొనియాడారు. అసెంబ్లీలో బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదించేలా కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. పరకాల సమన్వయ కమిటీ సభ్యులు సోద రామకృష్ణ, కుంకుమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొలుగురి రాజేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్ కుమార్, మాజీ ఎంపీపీ రామ్మూర్తి, కృష్ణయ్య, రఘు నారాయణ, భిక్షపతి, సంపత్, సదానందం, రమేశ్, రఘుపతి, అనిల్, చంద్రమౌళి, వెంకటస్వామి, తాజుద్దీన్, జెమిని, సుమన్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు రాజనరసింహ, పొన్నం ప్రభాకర్ గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. 30 సంవత్సరాల వర్గీకరణ పోరాటంలో ఎంతోమంది అమరులయ్యారని, ఇకనుంచి ఎలాంటి మరణాలు జరుగకూడదని సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అందరికీ సమన్యాయం చేసే విధంగా శాసన సభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును అమోదించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, సుకినె సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, గొర్రె మహేందర్, శీలం అనిల్ కుమార్, వినోద్, సంపత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంపై మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు వాసు, కిరీటి, నాయకులు సుధాకర్‌రెడ్డి, స్వామి, మాజీ సర్పంచ్‌లు రాజు, రవికుమార్, సొసైటీ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, డైరెక్టర్ జయ్‌పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రిన్సిపాల్ అనిత బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని అన్నారు. పరీక్షల సమయంలో ఆందోళన చెందకుండా భయం వీడాలని సూచించారు. వందశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేశారని స్పష్టం చేశారు. విద్యార్థులకు పలు సందేహాలు రాగా ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో చంద్రకళ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో పెరుగుతున్న అసమానతలు

కేయూ క్యాంపస్: దేశంలో అసమానతలు పెరిగిపోతున్నాయని, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం అవుతోందని, రాజ్యాంగంలోని ఆదేశాల సూత్రాల అమలుకు పాలకులపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని సామాజిక వేత్త, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో 75ఏళ్ల రాజ్యాంగం మైలురాయి : సమస్యలు – సవాళ్లు’ అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో భాగంగా బుధవారం ‘లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ రోల్ ఆఫ్ డైరెక్టివ్ ప్రిన్సిపల్స్ ఆఫ్ స్టేట్ పాలసీ ఇన్ ప్రజెంట్ సినారియో కానిస్టిట్యూషనలిజం’ అనే అంశంపై ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక అసమానతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు నుంచి తీసుకొచ్చిన అప్పులు తీర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.